సెయ్యేసుకు సెబుతున్నా... ఎన్ని బిందెలట్టుకెళతావేటి?.... మావేమైపోవాల?... గుండెమీద గుద్దీగల్ను... ఏవేవో బూతులు... శరీర భాష... ఏవేవో కేకలు... ఏవేవో అరుపులు... తోసుకుంటున్నారు... గుద్దుకుంటున్నారు... చీరలు చింపేసుకుంటున్నారు... కొప్పులు పీకేసుకుంటున్నారు... రవికెలు చింపేసుకుంటున్నారు... పిల్లలు భోరు భోరున ఏడుస్తున్నారు...

సూర్యుడు మండుతున్నాడు. సూర్యుడికి తన కోపాన్ని ఎవరిమీద చూపాలో తెలీదట! వాళ్లకి కూడా అంతే? ఎందువల్ల...?!

ముందుకి నెమ్మది నెమ్మదిగా సాగుతున్నాను. అంతా భయం భయంగా కనిపిస్తోంది. ఎక్కడ చూసినా పోలీసు వాహనాలు! ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా పోలీసులు! మూకలు మూకలుగా పోలీసులు! తెల్ల తెల్లని దుస్తుల్లో పోలీసులు పోలీసులు! యుద్ధ వాతావరణం! ఏం జరిగింది?! ఏం జరుగుతోంది?! సూర్యుడు విరిగి పడిపోయాడా?! అంతటా భయం భయం!! యువకులను పోలీసులు ప్రశ్నిస్తున్నారు!! తరుముతున్నారు!! వాహనాలను పోలీసులు ఆపేస్తున్నారు! అడుగుతున్నారు!! దండుకుంటున్నారు!! ఏవైందేవైంది!! అంతటా భయం భయం!!

భయం భయంగా అటూ ఇటూ చూస్తూ నెమ్మది నెమ్మదిగా ముందుకు సాగుతున్నాను. సాగిపోతున్నాను. భయం భయం!! చూశాను.. తెప్పరిల్లాను... కోలుకున్నాను... నవ్వుకున్నాను... పెద్ద పెద్ద బ్యానర్లు... ప్రపంచ తెలుగు మహాసభలు... బిగ్గర బిగ్గరగా నవ్వుకుంటూ, పగలబడి విరగబడి నవ్వుకుంటూ, చల్లబడ్డాను. ముందుకి సాగిపోతున్నాను.

అనుకోకుండా ఆకాశంలో తెల్ల తెల్లని మబ్బులు. అవి కురిసే మబ్బులు కాదు. మెల్ల మెల్లగా అటూ ఇటూ తిరుగుతున్నాయి.

ఆకాశంలోకి చూస్తూ నడుస్తున్నాను. ఆకాశం సామ్రాజ్యవాదంలా కనిపిస్తోంది.

ఒక పెద్ద పార్కులోకి వెళ్లేను. పొదల వెనక పచ్చని గడ్డిమీద కూర్చున్నాను. ఒంటరిగా అలజడిగా కూర్చున్నాను. చెట్లు గాలిలో ఊగుతున్నాయి. నీడల్ని పరుస్తున్నాయి. అవి చల్లగా చెదిరిపోతున్న చల్లని కలల్లా వున్నాయి.

నాకు సమీపంగా వున్న బల్లమీద ముగ్గురు కూర్చున్నారు. ఒకడి వయసు

ముష్టై వుంటుంది. ఇద్దరి వయసు నలభై దాటి వుంటుంది. ఏవేవో పరిశ్రమల గురించి మాట్లాడుకుంటున్నారు. పారిశ్రామికవేత్తల్లా వున్నారు. సామ్రాజ్యవాదంలా కనిపిస్తున్నారు. ఏవేవో మాట్లాడుకుంటున్నారు.

... దీన్ని పెద్ద పర్యాటక మహానగరంగా చేస్తారు... మనమే ఆ పని చేద్దాం... ఆ పని మనకే దక్కేలా చూసుకోవాలి... చేసుకోవాలి... ప్రైవేటీకరణలో చాలా చురుగ్గా, చాలాచాలా చురుగ్గా, చాలా చాలా జోరుగా పనిచేస్తున్నారు... ఈ పని మనకే దక్కేలా చేసుకోవాలి... వాళ్ల హొటళ్ల వ్యాపారం అభివృద్ధి కావాలంటే పర్యాటక వ్యాపారాన్ని అభివృద్ధి చేయకతప్పదు... మద్యపానాన్ని చట్టబద్ధం చేసేశారు... వ్యభిచారాన్ని కూడా చట్టబద్ధం చేసేస్తారు. నగ్న నృత్యాలను చట్టబద్ధం చేసినా చేయకపోయినా అవి ఎప్పుడూ జరుగుతూనే వున్నాయి... జరుగుతూనే వుంటాయి... ఇక్కడ పర్యాటక పరిశ్రమ తప్పక అభివృద్ధి చేస్తారు చేస్తారు... ఆ పని మనకే దక్కేలా చేసుకోవాలి... వాళ్లకి కావాల్సింది వాళ్లకు పారేద్దాం... కోట్లు కోట్లు...

అలా ఏవేవో మాట్లాడుకుంటూ లేచి నిలబడ్డారు. అటూ ఇటూ ఇటూ అటూ - చూస్తూ నిలబడ్డారు. సముద్రం వైపూ - కొండల వైపూ - తేరిపారి చూస్తూ నిలబడ్డారు. ఏవేవో మాట్లాడుకుంటూ వెళ్లిపోయారు.

ఎక్కణ్నుంచో వచ్చిన ఓ గెద్ద రివ్వు రివ్వున ఎగురుతోంది. పచ్చ గడ్డిలో పొట్టకోసం పరుగులు తీస్తున్న ఓ కప్పను తన్నుకుపోయింది. రివ్వు రివ్వున ఎగిరిపోయింది.

అక్కణ్నుంచి కదిలేను. దట్టంగా వున్న పొదలవేపు వెళ్లేను. జడల పొదల దగ్గర కూర్చున్నాను. పెద్ద పెద్ద చెట్ల చిక్కని చల్లని చీకటి నీడలు. ఎత్తయిన దట్టమైన పొదల గుంపులు. చీకటి చీకటి. నీడల చీకటి. చిక్కటి చీకటి. చీకటిని చీల్చుకుంటూ ఏవేవో చిరు కబుర్లు. పొదల మధ్య పచ్చ పచ్చని గడ్డిలో చీకటి చీకటి నీడల్లో ఇద్దరు యువకులు... దగ్గర దగ్గరగా... ఏవేవో చీకటి కబుర్లు... చీకటి చీకటి కబుర్లు...

...పెద్ద చదువులే చదివేశాం... ఏం లాభం... ఉద్యోగాల్లేవు... చదువు పెట్టుబడి... ఉద్యోగం పెట్టుబడి... ప్రతీదీ వ్యాపారం... ప్రతీదీ పెట్టుబడి... మేధస్సుకి విలువలేదు... ప్రతిభకి విలువలేదు... ఏ విలువకీ విలువలేదు... ఉన్నది కాస్తా ఖర్చు చేసేసి కాల్చేసుకొని మరీ చదివేం... ఏం లాభం ఏం లాభం... స్వేచ్ఛా

వ్యాపారమట.. పోటీ అట... పోటీతత్వమట... ఎవరి కోసం?!... ఎందుకోసం?!... ఎక్కడ చూసినా నిరుఉపాధి... నిరుద్యోగం... ఉద్యోగాలు పోయి వీధిన పడుతున్నారు... మనకి మరింక ఉద్యోగాలు రావు... ఉపాధి దొరకదు... పెట్టుబడి లేదు... పెళ్లిళ్లు కావు... మనకి ఆడవాళ్లొద్దు... పిల్లలొద్దు... యవ్వనం ఊరుకోదు... వయసు అల్లరిపెట్టక మానదు... ఇలాగే ఇలాగే మనిద్దరం... జంట జంటగా... చెట్ల చీకటి చీకటి నీడల్లో... పచ్చ గడ్డి పరుపుల్లో... సుఖిద్దాం... ఓహో! ఎంత సుఖం! ఆహా! ఎంత సుఖం!...

నా తల తిరిగిపోతోంది. ప్రకృతి పకపక నవ్వుతోంది. సూర్యుడు కళ్లు మూసుకుని చీకటి మబ్బుల్లోకి వెళ్లిపోయాడు. చెట్లనీడలు చీకటిని చీకటి చీకటి చేస్తున్నాయి.

"...పెద్ద పెద్ద పెట్టుబడులు పెట్టేవాళ్లు పెద్ద పెద్ద నేరాలు చేస్తున్నారు... ఉద్యోగం ఉపాధి లేనివాళ్లు చిన్న చిన్న నేరాలు చేస్తారు... చేస్తున్నారు... ఇదీ ఇవాళ మన నేరవ్యవస్థ...' అని అదంతా చూసిన ఎవరో చెప్పుకుంటూ వెళ్లిపోయారు.

అక్కణ్నుంచి బయల్దేరాను. మాధవధార బస్సు ఎక్కేను. నా ముందు సీట్లో ఓ స్త్రీ కూర్చుంది. కండక్టరు ఆమె పక్కకు చేరాడు. ఆఖరి స్టాపు దగ్గరపడుతోంది.

'... ఇయ్యాల నిన్నొగ్గను! సూసుకో!...'

'... సెవులు కోసేసిన ఏనుగు మొగం నువ్వానూ!... డబ్బులు రాల్చవు... నువు బోణీ కొడితే ఇయ్యాలల్లా ఏడుపునాగే వుంటాది!... నాలుగు బేరాలు దొరికినాక రా!... ఎదవ దొంగ మొగం నువ్వానూ!.. ఫో ...'

బస్సు ఆగింది. అందరం దిగిపోయాం. తోటల్లో చెట్లకింద పొదల్లో చీకటి చీకటి నీడల్లో కొందరు యువకులు జంటలు జంటలుగా కూర్చున్నారు.

'ఎల్లు!... బేరాలు ఎదురుసూత్తన్నారు!...'

'... అయి డబ్బులు రాల్చే బేరాలు కాదు... సదువుకున్నారంత... ఉజ్జోగాలు నేవంత... పెల్లాం కావాలన్నా డబ్బు కావాల... ముండ కావాలన్నా డబ్బు కావాల... ఆళ్లకాడ కాణీకూడా నేదు... ఆళ్లల్లో ఆళ్లే కింద మీదా

పడతావుంతారు... ఏటి సేత్తారు?!...' ఆమె విషాదంగా చీకటిగా నవ్వుతూ చీకటి నీడల్లోకి వెళ్లిపోయింది.

'... అభివృద్ధి అంటే ఏంటి?!... అభివృద్ధి అంటే ఏంటి?!... అభివృద్ధి అంటే ఏంటి?!...' అని ఓ యువకుడు మంటలా మండుతూ మంటలా ప్రశ్నిస్తూ సూర్యుళ్లా మండుతూ వెళ్లిపోయాడు.

★ ★ ★

(గ్లోబలైజేషన్ కథలు - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ । మార్చి 2003)

(హిందీ అనువాదం - స్రవంతి - ద్విభాషా మాసపత్రిక - హైదరాబాదు - జనవరి 2005. అనువాదకులు: డా॥ ఎన్.ఎ. సూర్యనారాయణవర్మ)

-----

# మహావృక్షాలు

'ఒద్దు బాబూ! నానుచ్చుకోను! అర్ధరూపాయ కాదు, రూపాయ కాదు, అయిదొందలిచ్చినా నానుచ్చుకోను! అంతే! నా మాట ఇనుకో! పట్నం ఎల్లి పోతన్నవ్! అక్కిడ పైసానేందే పిట్ట కూడా కూయదంత! ఇక్కిడ మాకు గెంజినీళ్లతో దినం గడిసిపోద్ది! అక్కిడ నీ కలగవుద్దేటి? మీయమ్మా నాన్నల గురిచ్చి బెంగడిపోమాక! ఆల్లని మావ్ కంటి పాపల్లా సూసుకుంతాం! ఊరంతా - మావంతా - ఉన్నాం కదేటి? నీకు దిగులెందుకంత?... నానుచ్చుకోను... అంతే!..' కంటతడితో కన్నమ్మ చెప్పిన మాటలు నేను మర్చిపోలేకపోతున్నాను!

ఎందువల్ల?!...

ఆ రోజు కూడా మర్చిపోలేను. అది నా జీవితాన్ని మలుపు తిప్పిన రోజు. ఉద్యోగం దొరికిన రోజు. ఉద్యోగంలో కొత్తగా చేరడానికి వెళ్ళిన రోజు. మా ఊరికి నన్ను నేను దూరం చేసుకున్న రోజు. అటువంటి రోజుని నేనెలా మర్చిపోగలను? గ్రామీణ జీవితం నుండి నగర జీవితంలోకి - విద్యార్థి జీవితం నుంచి ఉద్యోగ జీవితం లోకి - నన్ను ప్రవేశపెట్టిన ఆ రోజుని నేనెలా మర్చిపోగలను?

మా తలిదండ్రులు వెళ్లొద్దన్నారు.

'వెళ్లొద్దు. ఇక్కడే ఉండిపో. ఇక్కడే ఏదో ఊళ్లో ఉపాధ్యాయుడిగా చేరిపో. మొక్కలను వృక్షాలుగా పెంచినట్లు పిల్లలను మానవ వృక్షాలుగా చేస్తూ నీ జీవితాన్న ప్రయోజనకరం చేసుకో. నువ్వు జీవిస్తూ తోటి మానవుల సేవలో నీ జీవితాన్ని ధన్యత చేసుకో. నీ ఊర్ని నువు బాగుచేసుకో. అభివృద్ధి చేసుకో. ఇదే నా ధన్యత అనీ చూపించుకో. నీ చదువుని - జ్ఞానాన్ని ప్రజల ప్రయోజనానికి సద్వినియోగం చేసుకోగలిగినప్పుడే - అది నిజమైన చదువు, జ్ఞానం అవుతుంది... జీవించడానికి డబ్బు కావాలి. ప్రజా జీవితానికి హానికరం కాకుండా - దోపిడీలు చేయకుండా - కష్టించి శ్రమించి సుఖంగా జీవించగలం. అది సాధ్యమైంది... సుఖమైంది... ప్రయోజనకరమైంది... ఉపాధ్యాయుడిగా నేను అయిదో ఆరో మానవ వృక్షాలను తయారుచేశాను.... గర్విస్తున్నాను.'

ఆ విధంగా మా నాన్నగారు నాకు చాలా చెప్పేరు. నేను చాలా విన్నాను.

ఆయన మాటలు నేను పట్టించుకోలేదు! ఎందువల్ల?!...

★ ★ ★

మా నాన్నగారు గర్వంగా చెప్పుకుంటున్న వృక్షాలు - మహావృక్షాలు - నాకు తెలుసు. వారి ఎదుగుదల నాకు తెలుసు. అక్రమాలూ - ఆక్రమణలూ - విస్తరణలూ - చేస్తూ మరే మొక్కా మొలవకుండా, ఎదగకుండా, ఎలా వ్యాపిస్తున్నారో నాకు తెలుసు. ఆ వృక్షాల - మహావృక్షాల - పెనుగాలికి ప్రజలు తట్టుకోలేకపోతున్నారు! నేను మాత్రం ఎలా తట్టుకోగలను?!

బాగుపడాలనుకున్నవాడు బాగుపడ్డమే చేస్తాడు కానీ, మరేదీ చూడడనీ, చేయడనీ కూడా ఎంతో కొంతమేరకు మహావృక్షాల నుంచి విద్యార్థి దశలోనే నేర్చుకున్నాను. సంస్కరణ జీవన జ్ఞానంలో మా తలిదండ్రులు చూసిన స్వప్నజగత్తు కూలిపోతుందనీ, కూలిపోతోందనీ కూడా గుర్తించాను.

నగరం వెళ్ళిపోడానికీ, మంచి ఉద్యోగంలో చేరిపోడానికీ నిశ్చయించుకున్నాను. నాతో వచ్చేయమని ప్రార్థించేను. రానన్నారు.

మాకు ఊరు ఉంది. ఊళ్లో చాలామంది ఉన్నారు. వారిని మేం మా పిల్లల్లా చూసుకుంటాం. వారు మమ్మల్ని తలిదండ్రుల్లా చూసుకుంటారు. మా ప్రశాంత సుఖ జీవనాన్ని పాడుచేసే ప్రయత్నం చేయొద్దు - ఆ విధంగా చెప్పి కన్నీళ్ళతో నన్ను ఆశీర్వదించేరు.

★ ★ ★

మాది చాలా చిన్న ఊరు. నర్సీపట్నానికి ఆరుమైళ్ల దూరంలో ఉంది. రెండు మైళ్ల కాలినడక చేస్తేనే గానీ బస్సు వెళ్ళే రోడ్డు చేరుకోలేం.

ఆ ముందు రోజున వాన పడింది. ఊరు ఊరంతా గరువుల్లోకి వెళ్లిపోయింది. పెట్టెలు మోయడానికి ఎవరూ దొరకలేదు. నేనొక్కణ్నే వాటిని మోయలేను. ఏం చేయాలో ఆలోచిస్తున్నాను. నిజానికి నేను వెళ్ళిపోతున్నట్లు ఎవరికీ తెలీదు. చెప్పలేదు. చెబితే చాలామంది పనులు మానేసి ఉండిపోతారు. వెళ్లొద్దని కూడా వత్తిడి చేస్తారు.

అనుకోకుండా అంతలో ఎందుకో కన్నమ్మ వచ్చింది. ఆమె పేద రైతు కూతురు. పెళ్ళయిపోయింది. పిల్లలు కూడా ఉన్నారు. నేను వెళ్ళిపోతున్నట్లు తెలుసుకుంది. నేను అడక్కుండానే తనంతట తానే వస్తానంది. మేం బయల్దేరాం. పెట్టెలు మోస్తూ కన్నమ్మ నా వెంట నడుస్తోంది. ఏదో బాధతో చాలా దూరం నడిచేను. అకస్మాత్తుగా ఏదో ఆలోచన నా బుర్రలోకి వచ్చేసింది!

కన్నమ్మకు కూలి ఎంతివ్వాలి? వర్షం పడ్డం వల్ల పనులు ముమ్మరంగా ఉ న్నాయి. రోజు కూలీ ఐదు రూపాయలిస్తే కానీ ఎవరూ రారు. ఎప్పుడూ కురవని వాన ఆ ముందు రోజే కురిసింది. వాన మీద విరుచుకుపడ్డాను! వాన లేకపోతే పావలా కూడా ఖర్చు కాకుండా పని జరిగిపోయేది! కన్నమ్మకు ఎంతివ్వాలి?!.... పనికి వెళ్ళకుండా ఇంట్లో పడున్న దానికి పావలా ఇచ్చినా సరిపోతుంది! పావలా కూడా లేకుండా పడుండటం కంటే, పావలా సంపాదించుకోడం దానికి లాభమే కదా! అయినా - అర్ధరూపాయిద్దాం! ఒప్పుకోకపోతే రూపాయిద్దాం! ఇంకా ఒప్పుకోకపోతే - బస్సు రాగానే ఎక్కేసి డబ్బులు బయటకు విసిరేద్దాం. చచ్చినట్టు అదే తీసుకుంటుంది!...

రోడ్డు చేరుకున్నాం. బస్సు వచ్చింది. వెళ్ళిపోయాను.

కన్నమ్మ ఏమీ పుచ్చుకోలేదు! నా తల్లిదండ్రుల నుంచి నేనేమి నేర్చుకోలేదు! మహావృక్షాల ప్రభావంలో నా ఆలోచన అలా తయారైంది! నా చదువు నాకదే నేర్పింది!

కన్నమ్మ మాటలు నేను మర్చిపోలేకపోతున్నాను!

నాలోని నీచమైన దోపిడీ స్వభావం మాత్రం దానికి కారణం కాదు! కాజాలదు! ఎందుకంటే - దోపిడీ స్వభావం దాన్ని నీచత్వంగా అనుకోదు! దాన్ని తెలివిగా అభివృద్ధి మార్గంగా అనుకుంటుంది!! మరెందువల్ల?!...

★ ★ ★

తల్లిదండ్రులు బతికున్నంతకాలం సంవత్సరానికి ఒకటి రెండుసార్లు మా ఊరు వెళుతూ వుండేవాణ్ని. ఆ తరువాత కొద్దిసార్లు మాత్రమే వెళ్లాను. వెళ్లినప్పుడల్లా వృక్షాలనూ - మహావృక్షాలనూ కూడా కలుసుకుంటున్నాను.